బ్రిటన్‌లో పోర్టు ఉద్యోగుల సమ్మె

ఫెలిక్స్‌స్టో: బ్రిటన్‌లో అతిపెద్ద కంటైనర్ పోర్టు అయిన ఫెలిక్స్‌స్టోలో ఉద్యోగులు వేతనాలు పెంచాలని డిమాండ్‌చేస్తూ సమ్మె ప్రారంభించారు. గత 30 ఏళ్లలో ఈ పోర్టులో సమ్మె జరగడం ఇదే మొదటిసారి. మొత్తం 1,900 మంది ఉద్యోగులతో కూడిన యూనిట్ యూనియన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. పోర్టులో పనిచేసే ఉద్యోగులకు ఫెలిక్స్‌స్టో డాక్ అండ్ రైల్వే కంపెనీ 7శాతం వేతన పెంపును ప్రతిపాదించింది. కానీ, ఈ పెంపు ద్రవ్యోల్బణం కంటే తక్కువగా ఉందని యూనిట్ యూనియన్ తిరస్కరించింది. ఈ సమ్మె తమను తీవ్రంగా నిరాశపర్చిందని పోర్టు ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. సమ్మెను దృష్టిలో పెట్టుకొని ఓడ రేవు వద్ద భద్రత పెంచారు. ఫెలిక్స్‌స్టో పోర్టు బ్రిటన్‌లోనే అత్యంత రద్దీగా ఉండే ఓడరేవు. దేశం మొత్తంలో జరిగే కంటైనర్ ట్రేడ్‌లో 48శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇక్కడ మొత్తం 2,550 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం అతితక్కువ మంది మాత్రమే విధుల్లోకి వస్తున్నట్లు పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ సమ్మె 8 రోజులపాటు జరగనుంది. వర్కర్లకు ఏడుశాతం పెంపు, 500పౌండ్ల ఏక మొత్తం ప్రతిపాదించినట్లు పోర్టు వర్గాలు చెబుతున్నాయి. ఈ సమ్మె 8 రోజులకు మించి జరిగితే బ్రిటన్ పంపిణీ వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పోర్టులపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే బ్రెగ్జిట్, కోవిడ్ కారణంగా బ్రిటన్‌లోని చాలా కంపెనీల్లో సరకు కొరత ఉంది. ఈ నేపథ్యంలో తాజా సమ్మెతో ఇది మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉంది.

విశాలాంధ్ర ప్రపంచం

వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం

క్యూబా-రష్యా నిర్ణయం

మాస్కో: అన్ని రంగాలలోనూ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని క్యూబా, రష్యా నిర్ణయించాయి. ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 120సంవత్సరాలు అయింది. ఈ వార్షికోత్సవాన్ని రెండు దేశాలు కలసి నిర్వహించాలని ఈ రెండు దేశాలు నిర్ణయించాయని రష్యాలో క్యూబా రాయబారి జులియో గార్మెండియా చెప్పారు. క్యూబా అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోను, ఇతర అన్ని సందర్భాల్లోను రష్యన్ ప్రభుత్వం, ప్రజలు తమకు అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఇంధనం, రవాణా, బయో టెక్నాలజీ వంటి వ్యూహాత్మక రంగాల్లో ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టుల్లో రష్యా కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ ఏడాది జనవరిలో రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ ఫోన్‌లో జరిపిన సంభాషణలో క్యూబా పట్ల అమెరికా అనుసరిస్తున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రష్యా- క్యూబన్ సహకారంలో భాగంగా 200 మెగాబాట్ల థెర్మో ఎలక్రిటక్ బ్లాక్‌లను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు.

ఇమ్రాన్ ప్రసంగాల ప్రత్యక్ష ప్రసారం నిషేధం

ఇస్లామాబాద్: పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రసంగాల ప్రత్యక్ష ప్రసారంపై ఆ దేశంలో నిషేధం విధించారు. ఈ మేరకు ది పాకిస్థాన్ ఎలక్ట్రానిక్ మీడియా రెగ్యులేటరీ అథారిటీ(పీఈఎంఆర్‌ఏ) ఓ ప్రకటన విడుదల చేసింది. "దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా చేసే ప్రసంగాల ప్రసారంలో జాప్యం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఛానల్స్‌కు చెప్పినా అవి విఫలం అయ్యాయి. ఈ విషయాన్ని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ప్రసంగాల విషయంలో గమనించాం. ఆయన వరుసగా ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులపై నిరాధార ఆరోపణలు, విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. ఇవి సమాజంలో శాంతి భద్రతలను దెబ్బతీస్తాయి. ఖాన్ ప్రసంగాలు ఆర్టికల్ 19ని ఉల్లంఘిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖాన్ ప్రసంగాలను నేరుగా శాటిలైట్ చానల్స్‌లో ప్రసారం చేయడంపై నిషేధం విధిస్తున్నాం" అని పీఈఎంఆర్‌ఏ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇక రికార్డు చేసిన ప్రసంగాలను ఎడిట్ చేసిన తర్వాతే ప్రసారం చేయాలని ఆదేశించింది. ఇమ్రాన్ ఖాన్ సహాయకుడు షాబాజ్ గిల్ అరెస్టుకు నిరసనగా శనివారం ఇమ్రాన్, ఆయన పార్టీ పీటీఐ నిర్వహించిన ఆందోళన సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, మహిళా మేజిస్ట్రేట్, ఎలక్షన్ కమిషన్, రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెడతామని బెదిరించారు. దిగుమతి చేసుకున్న పాలకుల నిరంకుశ పాలన అని ఆరోపించారు. ఇక సైన్యాన్ని ఉద్దేశించి తటస్థులని వెటకారంగా మాట్లాడారు. అదే సమయంలో తన మద్దతుదారులు దొంగల ముఠాకు కాకుండా, దేశానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇమ్రాన్ వ్యాఖ్యలపై పాక్ సైన్యం మౌనం వహించింది. మరోపక్క పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ, జామాతే ఉల్ ఇస్లామి ఫజల్, ఎంక్యూఎం మాత్రం తీవ్రంగా స్పందించాయి. ఇమ్రాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాక్ న్యాయవ్యవస్థను అభ్యర్థించాయి.

జగన్ భేటీ నేడు

(మొదటిపేజీ తరువాయి)

కలుస్తారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సీఎం వరుస భేటీలు నిర్వహిస్తారు. మూడేళ్ల నుంచి బీజేపీకి జగన్ సర్కారు సహకరిస్తోంది. అయినా కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. పోలవరం, ప్రత్యేక హోదాపై ఒత్తిడి పెంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాల్సిన అవసరముందని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

'ఉపాధి'కి తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

మూలంగా ఆశించిన మేరకు పని దినాలు లభించకపోవచ్చని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పనులు గడువులోగా పూర్తి చేయడం కోసం కేంద్రం ఈ నిబంధన తీసుకొచ్చిందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కూలీలు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందని అంటున్నారు. ఇప్పటికే ఏటేటా పనిదినాలు పడిపోతుండటంతో జాబ్ కార్డులున్న అనేక మంది కూలీలు పట్టణాల్లో అడ్డా కూలీలుగా మారుతున్నారు, భవన నిర్మాణ పనులు, మట్టి పనులు వంటివి నిర్వహిస్తున్నారు. రోజుకు రూ.650 కూలీ లభిస్తే దానిలో రూ.50 నుంచి రూ.100 పని చూపించిన దళారులే కాజేస్తున్నారని వాపోతున్నారు. తండ్రి కొడుకులున్న కుటుంబాలలో పెళ్లి అయ్యి పిల్లలు వేరుపడితే... పిల్లలకు జాబ్‌కార్డు ఇస్తే... తల్లిదండ్రుల కార్డును రద్దు చేస్తున్నారు. అలాగే కొత్త నిబంధనల ప్రకారం, మొక్కల పెంపకం వంటి పనులు నిర్వహించడం కుదరదు. ఇప్పటి వరకు చేపడుతున్న పనుల్లో రాష్ట్రంలో ప్రధానంగా హరితహారం పనులే ఉపాధి హామీలో ఎక్కువగా ఉంటున్నాయి. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 75 పనులు నిర్వహిస్తున్నారు. వీటిలో మొక్కలు నాటడం, చెరువుల్లో పూడికతీత, పంట కాల్వల శుభ్రం, పొలాలు చదును, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల నిర్వహణ, పంట కల్లాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పంట పొలాలకు మట్టిరోడ్లు, చేపల చెరువుల నిర్మాణం, పెన్సింగ్ ఏర్పాటు వంటి పనులు నిర్వహిస్తున్నారు. కానీ నూతన నిబంధన ప్రకారం ఒక పని పూర్తయితేనే మరో పని చేయాల్సి ఉంటుంది. మొక్కల పెంపకానికి ఇది వర్తించదు.

సీపీఎస్ రద్దు కుదరదు!

(మొదటిపేజీ తరువాయి)

మిగిలిన 40 శాతం పీఎఫ్ఆర్‌డీఏ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెడితే ప్రతి నెలా పింఛన్ చేతికి ఎంత వస్తుందో తెలియదు. పింఛన్ మొత్తం మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుందని ఉద్యోగులు సీపీఎస్‌ను వ్యతిరేకించడానికి మొదటి కారణంగా చెప్పవచ్చు. చనిపోతే బ్యాలెన్స్ మాత్రమే ఇస్తారు... భార్యకు పింఛన్ ఉండదు... పైగా ట్యాక్స్, తమ సొమ్ముతో వ్యాపారం చేస్తారు గనుక కమీషన్ కూడా చెల్లించాలని ఇది ఉద్యోగిని వంచించడమేనని ఉద్యోగ సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. గద్దెనెక్కేంత వరకు వరాల జల్లు కురిపించి ఆనక మొండిచేయి చూపడం ఎంతవరకు న్యాయం అని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. పరిణామాలు చూస్తుంటే అసలు సీపీఎస్ రద్దు హామీ హుళక్కేనా అన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి ఉద్యోగి పింఛన్ పొందడం సామాజిక హక్కు అని, ప్రభుత్వ పాలనలో ఉద్యోగులదే ముఖ్య భూమిక అని, ప్రతి పథకం ప్రజల ముంగిటకు చేర్చడంలో వారి పాత్ర అనన్యసామాన్యమైందనీ, వారి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే తన ధ్యేయమని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు నమ్మి మోసపోయామని చాలామంది అంటున్నారు. ఆర్థిక భారం పడుతుందంటూ తమను బుజ్జగించేందుకు సీపీఎస్ అమలు సాధ్యం కాదనీ, గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలు చేస్తామని వైసీపీ ప్రభుత్వం కొత్త ప్రతిపాదన తీసుకొచ్చిందనీ, అనేక లొసుగులతో కూడిన ఈ స్కీమ్‌తో తమకు శఠగోపం పెట్టేందుకేనని ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం ఇదే ప్రతిపాదన తీసుకొచ్చినా నిర్ద్వందంగా తోసిపుచ్చినట్టు చెప్పారు. ఇటీవల పార్లమెంట్‌లో పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే ఉద్దేశ్యం లేదనీ, కొత్త పింఛన్ విధానం రద్దు చేసే ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేయడంతో ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ రద్దుపై నీలినీడలు అలముకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో అధిక శాతం సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటుంది' అని న్యాయమూర్తి జస్టిస్ లలిత్ అన్నారు. ఎల్‌ఏడీసీ వ్యవస్థను వివరిస్తూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాష్ట్రం తరపున నేర కేసులను కొనసాగిస్తున్నారని, ఇదే మార్గంలో ఇటువంటి కేసులు పేద వ్యాజ్యాల కోసం ఈ యంత్రాంగం ద్వారా పోరాడటం జరుగుతుందని, దీనికోసం ప్రభుత్వం నుంచి నల్సా మార్గం ద్వారా నిధులు కూడా వస్తాయని ఆయన అన్నారు. పేదలు ప్రైవేటు న్యాయవాదులను నియమించుకోవాల్సిన పరిస్థితిని 'వ్యాజ్యం వ్యాధి' అని తెలిపారు. ఎల్‌ఏడీసీ వ్యవస్థ విజయం ఏమిటంటే, వ్యాజ్యంలో చిక్కుకుని ఆర్థికంగా చితికిపోయిన పేదలకు న్యాయ సహాయం ద్వారా విశ్వాసం కల్పించడమని అన్నారు. న్యాయ సహాయం ఉద్యమంలో గత 15 నెలల్లో సాధించిన విజయాలకు సంబంధించి వారికి కృతజ్ఞతలు తెలిపారు లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించడంలో సాధించిన విజయాన్ని కూడా జస్టిస్ లలిత్ కొనియాడారు. 'ప్రతిసారీ, లోక్ అదాలత్ గణాంకాలను మెరుగుపరుస్తుంది. మేము సాధించిన మైలురాయి. ఢిల్లీ మినహా మొత్తం 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆగస్టు 13న నిర్వహించిన మూడో లోక్ అదాలత్ కోటి మార్కును అధిగమించి చరిత్ర సృష్టించింది' అని జస్టిస్ లలిత్ వివరించారు. అయితే ఇది ఆత్మసంతృప్తి చెందాల్సిన సమయం కాదని, ఎందుకంటే ప్రజలు అవగాహన కలిగి ఉన్నప్పుడు వారి అంచనాలు స్వయంచాలకంగా తలెత్తుతాయని చెప్పారు. వారు వ్యవస్థ ఓదార్పునిస్తుందని ఆశిస్తారని, న్యాయ సేవల సంస్థలకు పరీక్ష ఇక్కడే ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

సిసోడియాకు లుక్ ఔట్ నోటీసులపై ఆప్ ఆగ్రహం

న్యూఢిల్లీ : మద్యం పాలసీ అమలులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సహా మరో 13 మందికి సీబీఐ లుక్ ఔట్ నోటీసులు జారీ చేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ మండిపడింది. ప్రతిరోజు ఉదయాన్నే సీబీఐ-, ఈడీ ఆట మొదలవుతుందని సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. సామాన్య ప్రజానీకం పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్నారని, యువత ఉద్యోగాలు లేక అల్లాడిపోతున్నారని ఇవేమీ పట్టని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతోందని ఘాటుగా విమర్శించారు. ఇదిలా ఉండగా మోదీజీ...ఇదేం డ్రామా... ఎక్కడికి రమ్మంటారో చెప్పండి అంటూ ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ట్వీట్ చేశారు.

'ఇంజినీరింగ్' పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 2022-23 విద్యా సంవత్సరానికిగాను ఐఐటీ, నిట్, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఇటీవల జేఈఈ (మెయిన్స్) రెండో విడత ఫలితాల్ని ఎన్‌టీఏ వెల్లడించింది. ఆ ఫలితాల్లో అర్హత సాధించిన వారందరికీ, ఈనెల 28వ తేదీన జేఈఈ-అడ్వాన్స్ పరీక్ష జరగనుంది. జేఈఈ-అడ్వాన్స్ ఫలితాలు సెప్టెంబరు మొదటి వారంలో వెల్లడవుతాయి. కౌన్సెలింగ్‌కు సెప్టెంబరు మొదటి/రెండో వారంలో ప్రకటన విడుదల చేస్తారు. మొత్తం ఆరు రౌండ్లుగా జరిగే జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకునే సరికి, అక్టోబరు మొదటి వారం అవుతుంది. ఆ తర్వాత జోసా కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన ఇంజనీరింగ్ సీట్ల కోసం సీఎస్‌ఏబీ ద్వారా మరో రెండు విడతలు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనికి మరో పది రోజుల సమయం పడుతుంది. దీని ఆధారంగా జాతీయ స్థాయి ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ దాదాపు అక్టోబరు 15 నుంచి 20వరకు ఉంటుంది. దేశ వ్యాప్తంగా వేలాది మంది జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షల్లో అర్హత సాధిస్తారు. జేఈఈ-మెయిన్స్‌లో అర్హత సాధించిన వారు, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే గిఫ్ట్ కాలేజీల్లో సీట్లు పొందేందుకు అర్హులు. జేఈఈ-అడ్వాన్స్‌లో అర్హత సాధించిన వారికి ఐఐటీలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులంతా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లోనూ అర్హత సాధిస్తారు. ఉదాహరణకు ఏపీలో ఈఏపీసెట్-2022, తెలంగాణలో ఎంసెట్-2022లో చాలా మంది విద్యార్థులు ర్యాంకులు పొందారు. వారిలో వేలాది మంది జేఈఈ-మెయిన్స్‌లో అర్హత సాధించి, అడ్వాన్స్ పరీక్ష రాస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ఏపీఈఏపీసెట్/ఎంసెట్ కౌన్సెలింగ్‌ను జోసా కంటే ముందస్తుగా నిర్వహించడం వల్ల అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. జేఈఈ-మెయిన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులంతా, ముందస్తుగా ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందుతారు. ఆ తర్వాత జోసా కౌన్సెలింగ్‌లో వారికి ఎన్ఐటీలో సీటు వస్తే, దీనిని వదిలి వెళ్లిపోతారు. దీంతో సంబంధిత ఇంజనీరింగ్ సీట్లు ఖాళీ అవుతుంది. అలా వేలాది మంది వెళ్లిపోతే, మళ్లీ ప్రభుత్వం ఖాళీ అయిన సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. గతేడాది మాదిరిగా జోసా కౌన్సెలింగ్ అయ్యాకే, తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ప్రకటన విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మెకానికల్, సివిల్‌కు నిరాదరణ!

ఒకప్పుడు ఇంజనీరింగ్ విద్యలో ఎంతో ప్రాచుర్యం పొందిన మెకానికల్, సివిల్ బ్రాంచిలు నిరాదరణకు గురవుతున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ కళాశాలల్లో యేటా వేలాది సీట్లు మిగిలిపోతుండగా, అందులో సివిల్, మెకానికల్ అత్యధికంగా ఉంటున్నాయి. మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా యువత, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)పై ఆసక్తి చూపుతున్నారు. కన్వీనర్ కోటాలో సీఎస్ఈ సీటు రాదనుకుంటే ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో యాజమాన్య కోటాలో సీటును ముందస్తుగానే రిజర్వు చేసుకుంటున్నారు. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కళాశాలలైన ఐఐటీ, నిట్, ట్రిపుల్ ఐటీ, జాతీయ విశ్వవిద్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అంతా సీఎస్ఈపై మక్కువ చూపుతున్నారు. ఇక లేదనుకుంటే కొందరు విద్యార్థులు ఒక మెట్టు కిందకు దిగి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) తీసుకుంటున్నారు. మొత్తంగా చూస్తే విద్యార్థుల ఎంపికలో సీఎస్ఈకి మొదటి స్థానం ఉండగా, ఆ తర్వాత ఈసీఈ రెండో స్థానంలో ఉంది. విద్యార్థుల డిమాండ్‌ను గుర్తించిన ప్రైవేట్ కళాశాలలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల యాజమాన్యం సీఎస్ఈ సీటుకు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య కోటా ధరనూ అధికం చేశాయి.

బోధకుల కొరత

తెలుగు రాష్ట్రాల్లోని చాలా ఇంజనీరింగ్ కళాశాలల్లో బోధకుల కొరత నెలకొంది. ఏఐసీటీఈ నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించడం లేదు. తాత్కాలికంగా కొంత మందిని పని గంటల ఆధారంగా యాజమాన్యం ఏర్పాటు చేసుకుంటోంది. ప్రయోగ పరీక్షలు సక్రమంగా జరగడం లేదు. దీంతో పేరుకు విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందినప్పటికీ, వారు క్యాంపస్ నియామకాల్లో గానీ, క్యాంపస్ బయటగానీ సత్తా చాట లేకపోతున్నారు. ప్రైవేట్, డీమ్డ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు నైపుణ్యత, క్యాంపస్ నియామకాలు అధికంగా ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకే చాలా కళాశాలలు తపన పడుతున్నాయే గానీ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగోలుగా అనుమతులు జారీజేయడంతోనే ఇలాంటి కళాశాలలు పుట్టుకొస్తున్నాయని విద్యార్థి సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఏఐసీటీఈ నిబంధనలు పాటించని కళాశాలల్లో ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్ నిలిపివేయాల్సిన అవసరముంది.

చరిత్రాత్మకం సీపీఐ జాతీయ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ పరిణామాలు, పార్టీ వైఖరి చర్చిస్తామన్నారు. భవిష్యత్తు పోరాటాలకు ఈ మహాసభలు నాంది కానున్నాయన్నారు. జులైలో చైనాలో జరిగిన అంతర్జాతీయ సమావేశాల్లో వియత్నాం, చైనా, రష్యా, క్యూబా, భారత్ తదితర దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికి ప్రపంచం మొత్తాన్ని తన గుప్పెట్లో ఉంచుకునేందుకు అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాల కుట్రలు ఐక్యంగా తిప్పికొట్టాలని తీర్మానం చేశారని గుర్తుచేశారు. దేశ, రాష్ట్రాలలోని పాలకులు ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాల్ని అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఎలాంటి అనుభవంలేని జగన్ సీఎంగా బాధ్యతలు నిర్వహించి, మొత్తం విచ్ఛిన్నం చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. అమరావతి రాజధానికి మంగళం పాడారని, ప్రాధాన్యతగల ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ఈడ్పుగంటి విమర్శించారు.

రామకృష్ణ మాట్లాడుతూ, అక్టోబరు 14 నుంచి 18వరకు విజయవాడలో జరగనున్న పార్టీ జాతీయ మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలు, శ్రేయోభిలాషులు, సానుభూతి పరులు కృషి చేయాలని కోరారు. కమ్యూనిస్టుల ఐక్యతకు ఈ మహాసభలు మార్గదర్శకం కానున్నాయన్నారు. దేశంలో మారుతున్న రాజకీయాల పరిణామాల నేపథ్యంలో ఈ మహాసభలకు ఎనలేని ప్రాధాన్యత ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటు కార్పొరేట్‌కు ఊడిగం చేస్తూ, వారి ఆస్తుల్ని పెంచుతున్నాయని, ఇటు ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తూ, ప్రజలపై అన్ని రకాల భారాలు వేస్తున్నాయని విమర్శించారు. మోదీ పరిపాలనలో ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేకపోయారని, ధరలు తగ్గించలేదని, రైతుల సమస్యలపై నిర్లక్ష్యం చూపారని, ఉద్యోగాలు ఇవ్వలేదని వివరించారు. మోదీ తాను చెప్పినట్లుగా బ్లాక్‌మనీని వెనక్కి రప్పించలేకపోయారన్నారు. జాతి యావత్తు తమ ఆస్తిగా భావించే ప్రభుత్వ రంగ పరిశ్రమలను సైతం కార్పొరేట్లకు తెగనమ్ముతున్నారని విమర్శించారు. ఒక పరిశ్రమను సైతం నెలకొల్పలేక, ఉన్న పరిశ్రమలన్నీ ప్రైవేట్‌పరం చేస్తున్నారని తూర్పారబట్టారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు నిసిగ్గుగా వ్యవహరిస్తున్నాయని, రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఒక ఎంపీ పావలా ఖర్చులేకుండా ఢిల్లీ నుంచి ప్రజలకు నీలిచిత్రాలు చూపించి పార్లమెంటు సాక్షిగా తెలుగుజాతి గౌరవాన్ని మంటగలిపారన్నారు. ఆయన ఇంతవరకు క్షమాపణ చెప్పకుండా ఎదురు దాడికి దిగుతున్నారని, కమ్మ సామాజిక వర్గాన్ని, చంద్రబాబును, మీడియా సంస్థలను కులం పేరుతో దూషిస్తున్నారని తప్పుపట్టారు. ఈ ఘటనపై సీఎం జగన్ బెల్లం కొట్టిన రాయలా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బరితెగించి వ్యవహరిస్తున్నాయని, అందుకే రాజకీయాల్లో సమూల మార్పులు రావాలని, రాజకీయ ప్రక్షాళన కోసం ఈ మహాసభలు వేదిక కావాలన్నారు. దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులు పునరేకీకరణకు మహాసభలు ఒక దిక్సూచిగా నిలవనున్నాయని చెప్పారు. ఈ మహాసభలకు వామపక్ష జాతీయ నేతలు, 25 దేశాల నుంచి సౌహార్ద్ర ప్రతినిధులు రానున్నారన్నారు. ఎంతో చైత్యానికి మారుపేరు, ఉద్యమాలకు వేదికగా ఉన్న విజయవాడ నగరంలో జరగనున్న మహాసభలు విజయవంతంతోపాటు దేశ రాజకీయాల్లో మార్పుకు నాంది, కీలక మలుపు కానున్నాయని పునరుద్ఘాటించారు. అక్టోబరు 14న విజయవాడలో జరిగే భారీ ర్యాలీ, మహాసభలకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరానున్నారని చెప్పారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ మహాసభలు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు, కుటుంబానికి ఒక పండుగ లాంటివని చెప్పారు. వాటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. ఒక ఉత్సవంలా మహాసభలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శి అక్కినేని వనజ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.దుర్గాభవానీ, దోనేపూడి శంకర్, ఆహ్వానసంఘ ప్రతినిధులు రావుపల్లి రవీంద్రనాథ్, జి.కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, బుడ్డిగ జమిందార్, టి.అంజయ్య, వై.చెంచయ్య, డాక్టర్ సుజాత, పార్టీ, ప్రజా సంఘాల ప్రతినిధులు వైపీ రావు, సయ్యద్ అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో మసీదు నిర్మాణానికి

నిధుల సేకరణ

ఇస్లామిక్ ఫౌండేషన్ కార్యాచరణ సిద్ధం

లక్నో : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అయోధ్యలోని ధన్నిపూర్ గ్రామంలో ముస్లింలకు ఇచ్చిన ఐదెకరాల స్థలంలో మసీదు నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాద వ్యాజ్యంలో సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ముస్లిం పక్షానికి భూమిని ఇచ్చారు. మసీదు నిర్మాణం కోసం ఏర్పాటయిన ఇండో ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) ఆ స్థలంలో ఆసుపత్రి, లైబ్రరీ, సామాజిక వంట శాల, పరిశోధనా సంస్థతో పాటు మసీదును నిర్మించనుంది. ఫౌండేషన్ కార్యదర్శి అథర్ హుస్సేన్ పీటీఐతో మాట్లాడుతూ దాని అధ్యక్షుడు జుఫర్ ఫారూకీ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం ఆగస్టు 12న ఫరూఖాబాద్‌ను సందర్శించిందని, అయోధ్యలో మసీదు, ఇతర ప్రజా సౌకర్యాల నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలని మొదటిసారి విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా హాజరయిన వారు మసీదు నిర్మాణానికి కోటి రూపాయలు సమకూరుస్తామని హామీ ఇవ్వడంతో అక్కడ కూడా సుమారు రూ.2.5 లక్షలు వసూలు చేశారు. గతంలో మసీదు నిర్మాణానికి ఫౌండేషన్ రూ.25 లక్షలు వసూలు చేసిందని తెలిపారు. అయోధ్య అభివృద్ధి మండలి నుంచి ఒక నెలలో మసీదు, ఇతర భవనాల మ్యాప్‌ను పొందవచ్చని భావిస్తున్నారు. మ్యాప్ అందిన వెంటనే, నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. కాగా తొలుత ఆస్పత్రిని నిర్మించి ఓపీడీ ప్రారంభిస్తామని హుస్సేన్ తెలిపారు. వీలైతే, ధన్నీపూర్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మసీదు నేలను సిద్ధం చేయడంతో పాటు అక్కడ 'నమాజ్' నిర్వహించే ప్రక్రియను కూడా ప్రారంభించనున్నారు. 'ఆగస్టు 12న నగరంలోని చాలా మంది బడా వ్యాపారులు, రిటైర్డ్ అధికారులు, ఇతరులు ఫరూఖాబాద్‌లో నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ముంబై, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు ఫౌండేషన్ బృందాన్ని పిలుస్తున్నారు. మేము ఇప్పుడు మా 'రూట్ మ్యాప్'ను తయారు చేస్తున్నాము. తద్వారా ఈ ప్రదేశాలన్నీ సందర్శించి నిధులు సేకరించవచ్చు' అని ఆయన చెప్పారు. ఫౌండేషన్ గురించి ముస్లింల అభిప్రాయం చాలా వరకు మారిందని, ఇప్పుడు ప్రజలు దీనిని విశ్వసిస్తున్నారని ఐఐసీఎఫ్ కార్యదర్శి తెలిపారు. 'ముస్లింలే కాదు, ఇతర వర్గాల ప్రజలు కూడా ఫౌండేషన్‌ను విశ్వసిస్తున్నారు. మొదట్లో ముస్లిమేతరులు ఫౌండేషన్‌కు చాలా విరాళాలు అందించారు. కానీ ఇప్పుడు ముస్లింలు కూడా పెద్ద ఎత్తున పాల్గొనడానికి ఆసక్తి చూపడం ప్రారంభించారు' అని ఆయన అన్నారు. అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో సుప్రీం కోర్టు నవంబర్ 9, 2019న చారిత్రాత్మక తీర్పులో రామ మందిర నిర్మాణానికి అనుమతిస్తూనే మసీదు నిర్మాణానికి అయోధ్యలోని ప్రముఖ ప్రదేశంలో ఐదు ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది.

ప్రాణాంతకంగా లంపి చర్మ వ్యాధి

దేశ వ్యాప్తంగా 7,300కి పైగా పశువుల మృతి

న్యూఢిల్లీ: లంపి అనే చర్మ వ్యాధి కారణంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 7,300 పశువులు మృతి చెందాయని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. లంపి అనేది పశువులను తీవ్రంగా ప్రభావితం చేసే చర్మపరమైన అంటువ్యాధి అని పేర్కొన్నారు. ఈగలు, దోమలు, రక్తాన్ని పీల్చే కొన్ని రకాల కీటకాల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తోందని చెప్పారు. తొలుత ఐరోపాలో వెలుగు చూసిన ఆసియాలోనూ వ్యాపించిందని చెప్పారు. 2019 జూలైలో బంగ్లాదేశ్‌లో బయటపడిన ఈ వ్యాధి అదే సంవత్సరం భారత్‌లోనూ వెలుగు చూసిందని పేర్కొన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్‌లోనూ కేసులు నమోదైనట్టు చెప్పారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లోని పశువులు ఈ వ్యాధి ప్రభావానికి గురయ్యాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా 1.85 లక్షల పశువులు ప్రభావితం కాగా అందులో 7,300 పైగా పశువులు మృతి చెందాయని పేర్కొన్నారు. ఇప్పటివరకూ పంజాబ్‌లో 74,325 పశువులు, గుజరాత్- 58,546, రాజస్థాన్-43,962, జమ్మూ కాశ్మీర్-6,385, ఉత్తరాఖండ్‌ల-1,300, హిమాచల్ ప్రదేశ్-532, అండమాన్ నికోబార్-260 పశువులు వ్యాధి బారిన పడ్డాయని వివరించారు. అత్యధికంగా పంజాబ్‌లో 3,359 పశువులు మృతి చెందగా రాజస్థాన్-2,111, గుజరాత్-1,679, జమ్మూకాశ్మీర్-62, హిమాచల్ ప్రదేశ్-38, ఉత్తరాఖండ్-36, అండమాన్ నికోబార్-29 పశువులు మృతి చెందినట్టు చెప్పారు. వ్యాధి ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో వాక్సినేషన్ డ్రైవ్ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికి 17.92 లక్షల పశువులకు టీకాలు వేసినట్టు వివరించారు.

కీలక శాఖల తొలగింపు వెనుక కారణం ఏంటి?

గుజరాత్ ప్రభుత్వానికి కాంగ్రెస్, ఆప్ సూటి ప్రశ్న

అహ్మదాబాద్: ఇద్దరు కేబినెట్ మంత్రుల నుంచి కీలక శాఖలను తప్పించడానికి కారణమేంటో బహిరంగపర్చాలని ప్రతిపక్ష కాంగ్రెస్, ఆప్ పార్టీలు గుజరాత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. గుజరాత్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శనివారం అకస్మాత్తుగా కేబినెట్ ర్యాంక్ మంత్రులు రాజేంద్ర త్రివేది, పూర్ణేష్ మోదీల నుంచి వరుసగా రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖలను తొలగించారు. త్రివేది వద్ద ప్రస్తుతం విపత్తు నిర్వహణ, న్యాయ, శాసనసభ వ్యవహారాల శాఖలు మిగిలి ఉండగా... రవాణా, పౌర విమానయానం, పర్యాటకం, తీర్థస్థలాల అభివృద్ధి శాఖల బాధ్యతను మోదీ కొనసాగిస్తారు. త్రివేది, మోదీ ఇద్దరూ ప్రభుత్వంలో సీనియర్ మంత్రులు కాబట్టి, వారిని కీలక శాఖల నుంచి) తొలగించడానికి అసలు కారణమేమిటో తెలుసుకునే హక్కు గుజరాత్ ప్రజలకు ఉందని అని గుజరాత్ కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి మనీశ్ దోషి పేర్కొన్నారు. ఇద్దరు సీనియర్ మంత్రుల నుంచి ముఖ్యమైన శాఖలను తీసివేయాలన్న నిర్ణయం బీజేపీకి సంబంధించిన అంతర్గతం కాదని, ఇది ప్రజలపై ప్రభావం చూపుతుందని ఆప్ జాతీయ సంయుక్త కార్యదర్శి ఇంద్రనీల్ రాజ్‌గురు అన్నారు. ఈ నిర్ణయం వెనుక కారణాలేమిటో ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు. 'మీరు మంత్రులను ఎందుకు తొలగించారని గుజరాత్ ప్రజల తరపున నేను బీజేపీని అడగాలనుకుంటున్నాను? రాష్ట్ర బీజేపీ చీఫ్ సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి మధ్య విభేదాలే కారణమా? గుజరాత్ ప్రభుత్వం ఢిల్లీ నుంచి నడుస్తుందా? ప్రజలకు తెలుసుకునే హక్కు ఉంది' అని రాజ్‌గురు అన్నారు. ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తున్నట్లయితే... త్రివేది, మోదీలను రెండు శాఖల నుంచి తప్పించడం వెనుక గల కారణాలను దాచిపెట్టకూడదని దోషి అన్నారు. '2017లో గుజరాత్‌లో బీజేపీ అవినీతిని నిర్మూలిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది... అయితే అవినీతిని పెంచి పోషిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం పార్టీ, మొత్తం రాష్ట్ర మంత్రివర్గాన్ని మార్చినప్పటికీ అవినీతి ప్రక్రియ కొనసాగుతోంది'అని ఆయన విమర్శించారు. 'ఇద్దరు మంత్రులను మార్చడం వల్ల రాష్ట్రంలో అవినీతి ఆగదు. మొత్తం మంత్రివర్గాన్ని మార్చడం వల్ల కూడా దోపిడి స్వభావం మారలేదు' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా ఉంటే, త్రివేది, మోదీ ఎక్కడ విఫలమయ్యారో మాకు తెలియజేయాలని దోషి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్య పరిపాలనపై ప్రభావం చూపుతుందని రాజ్‌గురు అన్నారు. మంత్రులిద్దరూ ప్రజలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే కారణంతో లేదా అవినీతి కారణంగా వారిని తొలగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టులు ఇవ్వమని అడిగిన వారిని కాదని తన సన్నిహితులకే కాంట్రాక్టులు మంజూరు చేయడంతో మోదీని తొలగించారని కాంగ్రెస్ నేత ఆరోపించారు. కాగా రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖలను ఇకమీదట సీఎం పటేల్ అదనపు బాధ్యతలుగా నిర్వహించనున్నారు. గత సెప్టెంబరులో గుజరాత్ కేబినెట్ మొత్తం రాజీనామా చేయాలని బీజేపీ అగ్రనాయకత్వం కోరడంతో విజయ్ రూపానీ స్థానంలో పటేల్ ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఏడాది డిసెంబర్‌లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

గృహనిర్బంధంలో మెహబూబా

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని షోపియాన్‌లో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మరణించిన కాశ్మీరీ పండిట్ సునీల్ కుమార్ భట్ కుటుంబాన్ని పరామర్శించకుండా తనను గృహనిర్బంధంలో ఉంచారని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. శ్రీనగర్‌లోని గుప్కర్ ప్రాంతంలోని తన నివాసం గేట్లకు తాళం వేసిన ఫొటోలను ట్విట్టర్‌లో పోస్టు చేస్తూ కేంద్రంపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగానే ఉగ్రమూక కాశ్మీరీ పండిట్‌లను లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వమే కాశ్మీరీ పండిట్లను ఈ దుస్థితిలోకి నెట్టిందని దుయ్యబట్టారు. సునీల్ కుమార్ భట్ కుటుంబాన్ని పరామర్శించకుండా తనను నిర్బంధంలో ఉంచారని పేర్కొన్నారు.

మతోన్మాదుల చెరలో భారత్

రాజకీయాల మార్పు దిశగా సీపీఐ మహాసభలు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై రవీంద్రనాథ్, జంగాల అజయ్ కుమార్, గని, పిచ్చయ్య

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: అభివృద్ధి నిరోధక మతోన్మాద శక్తులు దేశాన్ని పాలిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, బీజేపీ శక్తులు దేశాన్ని భ్రష్టు పట్టించాయని చెప్పారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి పాటల శిక్షణా శిబిరాన్ని ఆయన పరిశీలిం చారు. అనంతరం మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బరితెగించి పాలన చేస్తున్నాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జగన్ పాలనలో ఏపీ పూర్తిగా అప్పులు పాలై ఆర్థికంగా దివాలా తీసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో ప్రజలపై పన్నుల భారం తీవ్రమైందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి విశాఖ నగరంలో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర 27వ మహాసభల్లో ఈ అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

జాతీయ 24వ పార్టీ మహాసభలు కూడా అక్టోబరు 14 నుంచి 18 వరకూ విజయవాడలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎనిమిదేళ్ల మోదీ పరిపాలనలో ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. రైతులను గాలికి వదిలేసిందని, ధరలు తగ్గించడంలో కూడా పూర్తిగా విఫల మైందని విమర్శించారు. నల్లధనాన్ని తిరిగి తెప్పిస్తామన్న మోదీ చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన పాలనలో పేద, ధనిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో రూ.59 ఉన్న డాలర్ విలువ నేడు రూ.89 చేరిందన్నారు. దేశ ప్రజలను హిందు, ముస్లిం, క్రైస్తవులు అనే పేరుతో విడగొట్టి రాజకీయ పబ్బంగడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయాలన్నిటిపై జాతీయ మహాసభల్లో చర్చించి దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో లో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మహంతి లక్ష్మణరావు, ఆరేటి రామారావు, వి.నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామ్యేలు, కుమార్, జె.నాగరాజు, మహేంద్ర, పున్నయ్య, సూరి, లాలు, దేవరకొండ శ్రీను, బి.కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వియత్నాం పర్యటనకు 'మోతుకూరి'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కమ్యూనిస్టు దేశమైన వియత్నాం పర్యటనకు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) తరుపున రాష్ట్ర ప్రతినిధిగా విజయవాడకు చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు మోతుకూరి అభ్యుదయ వెళ్లనున్నట్ట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్, కృష్ణాజిల్లా కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాల మధ్య శాంతి, స్నేహ సంబంధాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు తోడ్పడుతున్న అంతర్జాతీయ సంస్థ ఇస్కఫ్ తరుపున సోషలిస్టు దేశాల మధ్య రాకపోకలు ప్రతి ఏటా ఉంటాయని రాజశేఖర్ పేర్కొన్నారు. వారం రోజుల పాటు వియత్నాంలో పర్యటించి అక్కడి ప్రజల జీవన విధానం సంస్కృతిపై అధ్యయనం చేస్తారన్నారు. అభ్యుదయను ఇస్కఫ్ నాయకులు అభినందించారు.

ప్రధానమంత్రి ఫెలోషిప్‌కు హేమంత్ విక్రమ్ ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంకు చెందిన హేమంత్ విక్రమ్ అరుదైన ఘనత సాధించాడు. మైసూర్ జేఎస్ఎస్ ఫార్మసీ కాలేజీలో పీహెచ్‌డీ చేస్తున్న ఇతడు దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి ఫెలోషిప్‌కు ఎంకయ్యాడు. మన దేశంలో అతి కొద్ది మంది ప్రతిభా వంతులైన తమ రంగంలో నైపుణ్యం కలిగిన యువతకు పారిశ్రామిక ప్రాయోజిత పరిశోధన చేపట్టడానికి నెలకు రూ.87,000 జీతంగా అందిస్తుంది. హేమంత్ విక్రమ్ మాట్లాడుతూ, తాను ఈ ఫెలోషిప్‌కు ఎంపికైనందుకు సంతోషి స్తున్నట్లు చెప్పాడు. తనకు సహకరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రొఫెసర్ గురు పాదయ్య, ఢిల్లీకి చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ డైరెక్టర్ గుంజన్ కుమార్, తనను ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపాడు. రానున్న దశాబ్దంలో భారత్ స్టార్టప్ కంపెనీలకు నిలయంగా ఆవిర్భవిస్తుందన్నారు. స్టార్టప్ ఆలోచనలలో అడుగులు ముందుకేసే యువతకు మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. తన ప్రతిభ, శక్తి సామర్థ్యాలను వినియోగించి ఫార్మా రంగంలో ఒక స్టార్టప్ స్థాపించి ఉద్యోగాలు సృష్టించే దిశగా ఎదగాలనేది తన లక్ష్యం అని తెలిపాడు. తన జీవన ప్రయాణంలో సాధిస్తున్న ప్రతి విజయం తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, విలువలతోనే సాధ్యమైయిందని స్పష్టం చేశాడు.

లోకేశ్ అరెస్టు దుర్మార్గం

చంద్రబాబు, టీడీపీ నేతల ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అరెస్టును టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమ స్యలపై పోరాడుతున్న అతడిని అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలకు తిరిగే హక్కులేదా? అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన లోకేశ్‌తోపాటు నాయకులను వెంటనే విడుదల చేయాలని అధినేత చంద్రబాబు ట్వీట్ చేశారు. అనుబంధ సంఘాల నేతలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో అరెస్టును తప్పుపట్టారు.

జగన్‌కు ఎందుకంత భయం?: చంద్రబాబు

టీడీపీ నాయకులు పరామర్శలకు వెళ్తుంటే సీఎం జగన్ ఎందుకు భయపడుతున్నారంటూ చంద్రబాబు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తుంటే ఆంక్షలు ఎవరి కోసమో చెప్పాలని నిలదీశారు. పలాసలో రాజకీయ కక్షలతో తప్పు చేశారు కాబట్టే ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు.

ఇది జగన్ తాత జాగీరా?: యనమల రామకృష్ణుడు

ప్రజాసమస్యలపై పోరాటం చేసేవారిపైన, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపైన వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. లోకేశ్ ఏం తప్పు చేశారని అరెస్ట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం జగన్ తాత జాగీరా? అని నిలదీశారు.

లోకేశ్ అంటే వైసీపీకి భయం: ఎమ్మెల్యే

లోకేశ్‌ను చూస్తే వైసీపీ నేతలకు భయం పట్టుకుందని టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి అన్నారు. లోకేశ్‌ను అరెస్ట్ చేయడం దుర్మా ర్గమన్నారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, కావలి గ్రీష్మ, పంచుమర్తి అనురాధ అరెస్టులను ఖండించారు.

లోకేశ్ పర్యటనలో ఉద్రిక్తత

- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయింపు
- అదుపులోకి తీసుకుని వైజాగ్ తరలింపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేశ్ శ్రీకాకుళం జిల్లా పలాస పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విశాఖ పట్నం నుంచి రోడ్డు మార్గాన పలాస వెళుతున్న ఆయనకు పైడి భీమవరం వద్ద ఆ పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా వస్తున్న లోకేశ్ బృందాన్ని పోలీసులు శ్రీకాకుళం కొత్త రోడ్డు వద్ద అడ్డుకున్నారు.

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా పర్యటనకు అనుమతి లేదని, వెనక్కి వెళ్లిపోవాలని చెప్పటంతో లోకేశ్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్త పరిచారు. వైసీపీ దుర్మార్గంలో నష్ట పోయిన బాధిత కుటుంబాలను పరామర్శిం చేందుకు అనుమతి ఇవ్వక పోవడం దారుణమని, తాను మంత్రి గా పనిచేశాను... ఎమ్మెల్సీగా ఉన్నాను... రాష్ట్రంలో ఎక్కడైనా తిరిగే అధికారం ఉందని పోలీసులతో వాదించారు. ఎంత చెప్పినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. టీడీపీ శ్రేణులు వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మార డంతో పోలీసులు లోకేశ్‌తో పాటు మాజీ మంత్రి నిమ్మకాయల చిన్న రాజప్ప, కళా వెంకటరావు లను బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించి విశాఖపట్నం తరలించారు. జిల్లా నాయకులను అదుపులోకి తీసుకుని పరిసర పోలీస్ స్టేషన్‌లకు తరలించి ఆతరువాత విడిచిపెట్టారు.

ఏపీ, హరియాణా గవర్నర్ల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం భేటీ అయ్యారు. విజయవాడ రాజ్ భవన్‌లో అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దత్తాత్రేయను శాలువా, వెంకటేశ్వర స్వామి జ్ఞాపికతో హరిచందన్ సత్కరించారు. హర్యానా పర్యటనకు రావాలని విశ్వభూషణను బండారు ఆహ్వానించారు. సమకాలీన రాజకీయ అంశాలపై చర్చించారు.

పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మిలీషియా సభ్యుడి హత్య

విశాలాంధ్ర- చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా భైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 నెలల క్రితం పోలీసుల ఎదుట మావోయిస్ట్ మిలీషియ సభ్యుడు బమన్ లొంగి పోయాడు. పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఆదివారం తెల్లవారుజామున మావోయిస్టులు అతడిని అతి దారుణంగా హత్య చేశారు. చేతులు, కాళు నరికేశారు. మృతదేహాన్ని పొందం రోడ్డు పై వదిలి వెళ్లారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఈ ఘటనను ఎస్పీ ఆంజనేయ వర్షన్ ధృవీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్ణీత గడువులోగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా జరిగేలా చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ స్వరాజ్ మైదాన్ ప్రాజెక్టులో భాగంగా పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంత్రి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేదిక వద్ద జరుగుతున్న కాంక్రీట్ పనులతో పాటు దీనిలో భాగంగా నిర్మించనున్న కన్వెన్షన్ సెంటర్ పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా విగ్రహ నిర్మాణం పూర్తి చేయడానికి రాత్రి వేళల్లో కూడా పనులు చేయడానికి అధికారులు చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా పనులు కొంత మందకొడిగా జరిగాయని, అయితే ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు ఏవీ లేవు అని అధికారులు మంత్రికి వివరించారు. రాబోయే అంబేద్కర్ జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

కేసీఆర్ చేసిందేమీ లేదు

మునుగోడు సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పునకు నాంది అని బీజేపీ అగ్రనేత, హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం మునుగోడులో బీజేపీ నిర్వహించిన సమరభేరి సభకు ఆయన హాజరై ప్రసంగించారు. ఇది కేవలం రాజగోపాల్ రెడ్డి చేరిక సభ కాదన్న అమిత్ షా... వచ్చే ఎన్నికల నాటికి కేసీఆర్ వెళ్లిపోవడం ఖాయమన్నారు. తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎనిమిదేళ్ల పాలనలో కేసీఆర్ చేసిందేమీ లేదన్న అమిత్ షా, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని మోసగిస్తున్నారని విమర్శించారు. ప్రధాని ఇస్తున్న టాయిలెట్లలోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారు తప్ప రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు.

కేసీఆర్ సర్కార్‌ను పడగొట్టేందుకు నేడు రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరారని కేంద్ర అమిత్ షా అన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేలా ఈ మునుగోడు సభను చూస్తుంటే అర్థమవుతోందని, రాజగోపాల్‌రెడ్డిని బీజేపీలోకి చేర్చుకునేందుకు నేను ఇక్కడికి వచ్చానని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికలో రాజగోపాల్‌రెడ్డిని గెలిపిస్తే కేసీఆర్ సర్కార్ పడిపోవడం ఖాయమన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తామని కేసీఆర్ గతంలో చెప్పారని, ఇచ్చిన మాటలు అమలు చేయని పాలన కేసీఆర్‌ది అంటూ షా మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణకు బీజేపీ ముఖ్యమంత్రిని చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. మజ్లిస్‌కు భయపడి విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ నిర్వహించడం లేదని, తాము అధికారంలోకి వచ్చాక అధికారికంగా నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కిసాన్ బీమా యోజన పథకాన్ని అమలు చేయడం లేదని, తాము అధికారంలోకి వస్తే అన్ని పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెడతామన్నారు. తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ ఇల్లు ఇస్తామన్నారు..? ఇచ్చారా? అని అమిత్ షా ప్రశ్నించారు. అలాగే తెలంగాణలో దళితుడిని సీఎం చేస్తానని చెప్పారు... కానీ ఇంత వరకు అలా జరగలేదన్నారు. మీరిచ్చిన మాట నిలబెట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పేదలకు ఇచ్చే టాయిలెట్లను కూడా కేసీఆర్ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

ప్రతీ దళిత కుటుంబానికి 10 లక్షలు అందిస్తామని హుజూరాబాద్‌లో సీఎం కేసీఆర్ చెప్పారు... ఎంత మంది దళితులకు 10 లక్షల రూపాయలు అందాయని ప్రశ్నించారు. దళితులకు 3 ఎకరాల భూమి అన్నారు...ఎవరికైనా అందిందా? అంటూ అమిత్ షా ఉద్వేగంతో ప్రశ్నించారు. 2014 నుంచి టీచర్ల నియామకాలు ఆపేశారని, గిరిజనులకు ఎకరం భూమి ఇస్తాను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే దొడ్డు బియ్యం మొత్తం కొంటామని, దొడ్డు బియ్యం విషయంలో తెలంగాణ ప్రభుత్వం తప్పుడు మాటలు చెబుతోందని అమిత్ షా ఆరోపించారు.

మునుగోడులో బీజేపీకి డిపాజిట్ రాదు

మునుగోడు సభలో కేంద్ర మంత్రి అమిత్‌షా అబద్ధాలే మాట్లాడారని తెలంగాణ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ వేసిన ఒక్క ప్రశ్నకు కూడా అమిత్‌షా వద్ద సమాధానం లేదన్నారు. ఫ్లోరైడ్ నివారణకు ప్రధాన మంత్రి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. పెట్రోల్ ధరలపై అమిత్ షా మాటలు దొంగేదొంగ అన్నట్లుందని ఎద్దేవా చేశారు. మునుగోడు ప్రజలు బీజేపీకి డిపాజిట్ రాకుండా చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

'మునుగోడులోనూ అమిత్ షా అబద్ధాలే మాట్లాడారు. ఆధారం లేకుండా మాట్లాడే బండి సంజయ్ పాత్ర పోషించారు. కేసీఆర్ ఒక్క ప్రశ్నకూ అమిత్ షా వద్ద సమాధానం లేదు. సీఎం కేసీఆర్ ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ముకూడా లేదు. ప్రపంచంలోనే అద్భుత పథకం రైతుభీమా. ఫ్లోరైడ్ నివారణకు ప్రధానమంత్రి ఏమైనా చేశారా? పెట్రోల్ ధరలపై అమిత్ షా మాటలు దొంగేదొంగ అన్నట్లుంది. మునుగోడు ప్రజలు బీజేపీకే మీటరు పెడతారు. మునుగోడు ప్రజలు బీజేపీకి డిపాజిట్ రాకుండా చేస్తారు' అని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.

ఒక్కదానికే డబ్బులేదు... మూడెలా కడతారు

కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

విశాలాంధ్ర-విజయవాడ: ఒక్క రాజధానికే డబ్బు లేనప్పుడు మూడు రాజధానులు ఎలా కడతారని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌ను కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నిచారు. విజయవాడలో బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సంఘర్షణ యాత్ర ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ లిక్కర్ కింగ్ మాత్రమే కాదు.. స్టిక్కర్ కింగ్ అని విమర్శించారు. కేంద్ర పథకాలకు జగన్ తన స్టిక్కర్లు వేసుకుంటున్నారని పేర్కొన్నారు. అవినీతిలో ఏపీ నాలుగో స్థానంలో ఉంటే.. తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. కేసీఆర్, జగన్‌లు అవినీతిలో ప్రథమ స్థానం కోసం పోటీ పడుతున్నారన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక, ల్యాండ్ మాఫియాలే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని.. ఈ మాఫియాలన్నింటి ఆట కట్టిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును కాదని యువకులంతా జగన్‌కు అండగా నిలిచి గెలిపిస్తే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. జగన్‌ను గెలిపించిన యువతే ఇప్పుడు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

సీపీఐ నేత సిద్ది వెంకటేశ్వర్లు కన్నుమూత

నేడు అంత్యక్రియలు

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకులు సిద్ది వెంకటేశ్వర్లు (68) ఆదివారం ఇక్కడ తుదిశ్వాసవిడిచారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సరళ న్యాయమూర్తిగా పనిచేసి పదవి విరమణ పొందారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు కొత్తపేట విక్టోరియా మెట్రో రైల్వే స్టేషన్ దగ్గరనున్న అష్టలక్ష్మి గుడి సమీపంలోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని పార్టీ నాయకులు తెలిపారు.

ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం గ్రామంలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సిద్ది విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో క్రియాశీలక రాజకీయాల నుంచి కొంత కాలం క్రితం తప్పుకున్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ఆ తర్వాత పాల్వంచ ఏరియా కార్యదర్శిగా పనిచేస్తూ బూర్గంపాడు, అశ్వారావుపేట తదితర నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 1998లో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సిద్ది 2001లోనూ తిరిగి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2004 వరకు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సిద్ది వ్యవసాయ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా పని చేసిన సిద్ది రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2015లో ఖమ్మంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర తొలి మహాసభలో సిద్ది వెంకటేశ్వర్లు తిరిగి సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సౌమ్యునిగా, నిరాడంబరునిగా పేరొందిన సిద్ది ఎటువంటి పరిస్థితినైనా సమన్వయంతో చక్కదిద్దే వారు. అనేక సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న ఆయన పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఆయన అజాతశత్రువుగా పేరొందారు. ఆయన మృతికి అనేక మంది నాయకులు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నారాయణ సంతాపం

సిద్ది వెంకటేశ్వర్లు మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంతాపం తెలిపారు. విద్యార్థి, యువజన ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శిగా పార్టీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. రాష్ట్ర జనసేవ దళ్ కమాండర్ గా బాధ్యతలు నిర్వహించి అనేకమంది యువతి, యువకులకు శిక్షణ ఇచ్చారనీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, తన సహచరుడిగా సిద్ది వెంకటేశ్వర్లు పని చేశారని తెలిపారు.

నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయాం : పువ్వాడ

సిద్ది వెంకటేశ్వర్లు మరణం అత్యంత బాధాకరమనీ, ఆయన మరణంతో కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఏ పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. సిద్దితో అనేక దశాబ్దాల అనుబంధం ఉందని ఏ పని చెప్పినా కాదనకుండా చేసేవారని అంకిత భావంతో కమ్యూనిస్టు పార్టీ వ్యాప్తికి కృషి చేశాంన్నారు. పాల్వంచ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి విశేష కృషి చేసిన సిద్ది అజాతశత్రువుగా పేరొందారని కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ ఆలోచన తప్ప మరొకటి ఉండేది కాదన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు చాడ వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి, ముప్పాళ్లనాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్, ఎస్ సాబీర్ పాషా, బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ తదితరులు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'సిద్ది' మృతి తీరని లోటు

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శిగా పనిచేసిన సిద్ది వెంకటేశ్వర్లు మృతి తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో సిద్ది మృతికి సంతాపం తెలిపారు. వారి మరణం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ యావత్తు పేద ప్రజానీకానికి తీరని లోటన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మూడు విడతలుగాను, తెలంగాణ రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శిగా పనిచేసిన సిద్ది వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఆదివారం మరణించారన్నారు. సిద్ది వెంకటేశ్వర్లు విద్యార్థి ఉద్యమం నుంచి కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై చాలా కీలకంగా పనిచేశారని, పేదల సమస్యల పరిష్కారం కోసం, దళిత గిరిజనుల కోసం అహర్నిశలు కృషి చేశారని వివరించారు. తెలంగాణలో పోడు భూముల సమస్యపై చాలా ఆందోళన నిర్వహించి పేదల పక్షాన నిలిచారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనురాగ్ ఠాకూర్ విమర్శలు అర్థరహితం

గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ కార్యాలయం నుంచి సుజనా చౌదరి తీసుకొచ్చిన స్క్రిప్టును కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ చదివి, తమ ప్రభుత్వంపైన, సీఎం జగన్‌పైన అర్థరహితమైన విమర్శలు చేశారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, ఇక్కడి పరిస్థితులు, పరిపాలన చేస్తున్న సీఎం జగన్ గురించి మీకేమి తెలుసని ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో అమలు జరగనన్ని సంక్షేమ పథకాలు ఇక్కడ అమలవుతున్నాయన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే గాంధీజీ కన్న కలలను నిజం చేస్తూ, గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి 2 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చిన విషయం మీకు తెలుసా, తెలియదా? అని ప్రశ్నించారు. ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్ చొప్పున నియమించారని వివరించారు. మరో 90 వేల మందికి అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇంత తక్కువ సమయంలో 2 లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారా? అని నిలదీశారు. 2014-19లో ఏపీలో టీడీపీ అధికారంలో ఉందని, చంద్రబాబు హయాంలో చేసిన పనులేమిటని ప్రశ్నించారు. ఆయన ఓ అవినీతి చక్రవర్తి అని జోగి ఆరోపించారు. పవన్ కల్యాణ్‌కు బుర్ర తక్కువ మాటలెక్కువ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి టూరిస్టులాంటి వాడని, ఏ పార్టీతో పొత్తులో ఉంటాడో అతడికే తెలియదన్నారు. దమ్ముంటే, 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తానని చెప్పాలంటూ సవాల్ విసిరారు. సామాజిక న్యాయ నిర్మాత జగన్ అని, చంద్రబాబు ఇక షెడ్‌కు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- మైలవరంలో కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- ఘనంగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభం

మాట్లాడుతున్న రామకృష్ణ. విల్సన్, వనజ, సి.హెచ్.కోటేశ్వరరావు తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజలకు మేలు చేయడంలో కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి దారుణంగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై చంద్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి అందించిన స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లా సీపీఐ ప్రథమ మహాసభలు ఆదివారం మైలవరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన రెడ్‌షర్ట్ వలంటీర్లు ఎర్ర జెండాల చేతబట్టి మైలవరం పురవీధుల్లో కదం తొక్కారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన బస్‌స్టాండ్ సెంటరులో భారీ బహిరంగ సభ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ... కోట్లాదిమంది పేదలు ఉన్న దేశంగా భారతదేశాన్ని నిలిపిన అసమర్థ ప్రధాని మోదీ అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించలేకపోయిందని, నిత్యావసర ధరల పెరుగుదలను నియంత్రించడంలో, ఉద్యోగాలను భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. పార్లమెంటులో ఎంపీలను మాట్లాడేందుకు వీల్లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పావలా పేదల అకౌంట్‌లో వేసి ముప్పావలా ఎక్కడకు పోతుందో చెప్పటం లేదన్నారు. వైసీపీ నిర్వహించిన ప్లీనరీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ జగన్ భజన చేశారని చెప్పారు. ఆ భజన చాలదన్నట్లు కొత్తగా టార్గెట్ 175 అంటున్నారని పేర్కొన్నారు. ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారం చూసి పార్లమెంట్‌లో నవ్వుకుంటున్నారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయనే కక్షతో ప్రసార మాధ్యమాల యాజమాన్యాలపై కులాల పేరుతో విరుచుకుపడుతున్నారని చెప్పారు. కమ్మ వాళ్లు ఎంపీని బట్టలూడదీసుకుని తిరగమన్నారా అని ప్రశ్నించారు. ఎంపీ మాధవ్ నగ్న వీడియో వ్యవహారం, ఎమ్మెల్సీ డ్రైవర్ మృతి విషయాల్లో రాష్ట్ర పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శవాలను డోర్ డెలివరీ చేయటం మన రాష్ట్రంలో ఉన్న దారుణ పరిస్థితులకు అద్దం పడుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగకుండా ముఖ్యమంత్రి సైంధవుడు మాదిరి అడ్డు పడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి అందించిన స్ఫూర్తితో ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు రామకృష్ణ పిలుపునిచ్చారు. త్వరలో విశాఖలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలు, విజయవాడలో జరిగే జాతీయ మహాసభలకు సమాయత్తం కావాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ... కమ్యూనిస్టుల ఉద్యమాల ఫలితమే ముఖ్యమంత్రి ప్రకటించిన నవరత్నాలు పథకం అన్నారు. వాటి అమలు సక్రమంగా జరుగుతోందో లేదో చూడటం లేదన్నారు. దేశంలో భూపోరాటాలనేవి మొట్టమొదట కృష్ణాజిల్లాలో చంద్ర రాజేశ్వరరావు నేతృత్వంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. పార్టీ చీలిన తరువాత మైలవరం, ఎ.కొండూరు ప్రాంతాల్లో భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. అప్పుడు పేదల పక్షాన కమ్యూనిస్టులు భూపోరాటం చేసి భూములు సాగుచేసుకునేలా చేశారని గుర్తు చేశారు. మైలవరంలో 25వేల ఎకరాలు భూమిని పేదలు సాగుచేసుకుంటున్నారని చెప్పారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం అమలు చేసి ఫ్లోరైడ్ నీటి బాధల నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. ఉచితాలను ఎగతాళి చేయటం సరికాదని, సంక్షేమం లేకపోతే మానవవనరులను రక్షించుకోలేమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తే ముందుగా ఈ ప్రాంత ప్రజలు ప్రజాపోరాటాలకు సిద్ధం అయ్యేవారని తెలిపారు. ఇప్పుడు ఏ ఉద్యమం చేపట్టినా అక్రమ అరెస్టులు చేసి అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, చలసాని రామారావు ప్రసంగించారు. ఈ సభలో ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.దుర్గాభవాని, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎంపీటీసీ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణయ్య పాల్గొన్నారు.

ముందుగా మైలవరంలోని సీపీఐ కార్యాలయం శ్రామిక భవన్‌నుంచి సీపీఐ కార్యకర్తలు అరుణపతాకాలను చేతబట్టి భారీ ప్రదర్శన నిర్వహించారు. నూజివీడు, తిరువూరు ప్రధాన రహదారి గుండా ఈ ప్రదర్శన సాగింది.

కమ్యూనిస్టులు బలపడితేనే

పదిలంగా ప్రజాస్వామ్యం

సీపీఐ చిత్తూరు జిల్లా మహాసభల్లో నారాయణ

మాట్లాడుతున్న నారాయణ. వేదికపై హరినాథరెడ్డి, రామానాయుడు, మురళి, జనార్ధన్ తదితరులు

విశాలాంధ్ర- చిత్తూరు: దేశంలో కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఘనమైన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకు ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా పని చేసిన ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ప్రధాని మోదీ ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆదివారం సీపీఐ చిత్తూరు జిల్లా మహాసభల్ని జిల్లా కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, తాగునీరు లాంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యతల్ని విస్మరించాయని దుయ్యబట్టారు. తాత్కాలిక ప్రయోజనాలు కల్పిస్తూ అదే అభివృద్ధి అని చెప్పడాన్ని తప్పుబట్టారు. యూపీ, పంజాబ్, అసోం ఎన్నికల నేపథ్యంలోనే సాగు చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. మోదీ పాలన అంతా మూఢనమ్మకాలతో ముడిపడిందని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో ప్రజల ప్రాణాలను గాలికి వదిలి కార్పొరేట్ శక్తుల కొమ్ముకాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు దేశ ఆరోగ్య వ్యవస్థను అదానీకి అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. అదానీ ఇప్పటికే ఆరంగంపై కన్నేసి ఒక కంపెనీని రిజిస్టరు చేసుకున్నారని తెలిపారు. మత్తు మందులు సరఫరా చేసే అదానీకి ఆరోగ్య వ్యవస్థ అప్పగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విశాఖ స్టీల్‌ను అదానీకి అప్పగిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దేశం బాగుపడాలంటే మోదీ పాలన అంతంకావాలని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో జగన్ ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. నీతి అనే మాటను అవినీతి మయం చేశారన్నారు. మూడు రాజధానులు అంటూ జగన్ చేసిన ప్రకటనతో రాష్ట్రం అభివృద్ధి రహితంగా మారిందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో మోదీకి, రాష్ట్రంలో జగన్‌కు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి హరినాథ రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో సంబంధం లేకుండా జగన్ పాలన చేస్తున్నారని విమర్శించారు.

వారానికోసారి ఒక పథకం పేరుతో నగదు బదిలీ చేస్తూ ఇదే అభివృద్ధి అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్థికమంత్రి బుగ్గన అప్పుల సమీకరణ మంత్రిగా మారి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసి అప్పులు తెస్తే ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయన్నారు. సంక్షేమానికి తాము వ్యతిరేకం కాదని అయితే అభివృద్ధి కూడా ఉండాలనేది తమ అభిమతమని స్పష్టం చేశారు. ఈ బహిరంగసభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి జయలక్ష్మి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి జనార్దన్, మునిరత్నం నాయుడు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కార్యదర్శులు ఎస్ నాగరాజు, మురళి, పీఎల్ నరసింహులు తదితరులు ప్రసంగించారు. ఏపీ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సంగీతం గుజ్జప్ప, ఏం సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సురేంద్ర నాథ్, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రమాదేవి, కుమారి, సీనియర్ నాయకులు మణి, చెన్న కేశవులు, సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి, నగరి నారాయణ, నగర కార్యదర్శి గోపీనాథ్, దాసరి చంద్ర, రఘు, గజేంద్ర బాబు, ఆర్ముగం రెడ్డి, మహిళా నాయకులు విజయ గౌరీ, జమిలాబీ, మణి మేఘల, బాలజీరావు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోదీ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలు

సీపీఐ కడప జిల్లా మహాసభలో ఓబులేసు

మాట్లాడుతున్న ఓ బులేసు. పక్కన ఈశ్వరయ్య. చంద్ర, సుబ్బారెడ్డి తదితరులు

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్న ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు అన్నారు. సీపీఐ కడప జిల్లా మహాసభల సందర్భంగా స్థానిక డీజీఎమ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభను నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నేత రామకృష్ణ ఎగురవేశారు. మృత వీరులకు నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ తన అనుంగు కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని దుయ్య బట్టారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో ధరలు నియంత్రిస్తామని చెప్పిన మోదీ పాలనలో నిత్యావరసర ధరలు ఆకాశాన్నంటు తున్నాయన్నారు. ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు రెండుపూటల తిండికి నోచుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు అమాం తంగా పెరిగిపోయాయన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. వ్యవసాయ సాగు చట్టాలతో అన్న దాతలను ముంచాలని చూశారని వారి తిరుగు బాటుతో వెనక్కు తగ్గారని తెలిపారు. ఎనిమిదేళ్ల కాలంలో కోట్లాది మంది ఉద్యోగాలు ఊడిపోయా యన్నారు. 6లక్షలకు పైగా చిన్న తరహా పరిశ్రమలు మూత పడ్డాయని చెప్పారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్‌లను రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అగమ్యగోచరంగా ఉందన్నారు. అభివృద్ధి శూన్య మని, పరిశ్రమలు రావడం లేదన్నారు. అన్నవర్గాల ప్రజలతో ఘర్షణ తప్ప పరిపాలనపై దృష్టి సారించడం లేదని పేర్కొన్నారు. తెలంగాణలో అంగ న్వాడీ టీచర్లకు రూ.13 వేలు ఇస్తుంటే ఏపీలో రూ.11వేలు వేతనం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండు చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, సి సుబ్రమణ్యం, గాలిచంద్ర, ఎన్.వెంకటశివ, వీరశేఖర్, బషీరున్నీసా, ఏవి రమణ, ఎంవీ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, విజయ లక్ష్మి, పి.సుబ్బరాయుడు, రామలత పార్టీ మహాసభల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలపై పన్నులు... కార్పొరేట్లకు రాయితీలు

న్యూఢిల్లీ: సామాన్యులపై పన్నుల భారం మోపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... తన మిత్రులకు మాత్రం పన్నులు తక్కువగా విధిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. ప్రభుత్వం... సాధారణ ప్రజలపై అధిక పన్నులు వేయడం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు, తక్కువ పన్నుల కారణంగా కార్పొరేట్ల నుంచి తక్కువ ఆదాయాన్ని పొందుతున్నట్లు ఒక గ్రాఫ్ ద్వారా ఆయన వివరించారు. కార్పొరేట్ కంపెనీల కంటే ప్రజల నుంచి ఏళ్ల తరబడి వసూలు చేసిన ఆదాయాల శాతం ఎక్కువగా ఉందని రాహుల్ పేర్కొ న్నారు. 2010లో ప్రజలపై పన్నుల ద్వారా ప్రభుత్వానికి 24 శాతం ఆదాయం రాగా, కార్పొరేట్లపై పన్నుల ద్వారా 40 శాతానికి పైగా ఆదాయం సమకూరినట్లు గ్రాఫ్ స్పష్టం చేసింది. 2021లో కార్పొరేట్ సంస్థలపై పన్నుల ద్వారా వసూలైన ఆదాయం 24 శాతానికి తగ్గిందని, ప్రజలపై పన్నుల ద్వారా వసూలు చేసిన ఆదాయం 48 శాతానికి పెరిగినట్లు గ్రాఫ్ చూపిస్తోంది. ఆహార భద్రతా చట్టం, ఉపాధి హామీ పథకం వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ పేదరిక నిర్మూలన కోసం రూపొం దించినట్లు రాహుల్ చెప్పారు. రుణాలను మాఫీ చేయడం అసలైన 'ఉచితం'గా ఆయన పేర్కొన్నారు. కాగా జీఎస్టీ మండలి సమావేశంలో ఆహార పదార్థాలపై జీఎస్టీని ఏ రాష్ట్రం వ్యతిరేకిం చలేదన్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాదనను కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ తోసిపుచ్చారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ పెంపును వ్యతిరేకిస్తూ రాజస్థాన్ ముఖ్యమంత్రి రాసిన లేఖను ఆయన ట్విట్టర్ ద్వారా ప్రదర్శించారు. రాజస్థాన్ ముఖ్య మంత్రి అశోక్ గెహ్లాట్ ఆగస్టు 5న ఆహార పదార్థాలపై అధిక జీఎస్టీ విధించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. నిర్ణయాన్ని పునః పరిశీలించాలని ఆమెను కోరారు.

సీపీఐ జాతీయ మహాసభలకు

గుమ్మడి సోదరుల రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ మహాసభల జయప్రదాన్ని కాంక్షిస్తూ ఎన్టీఆర్‌జిల్లా గుంటుపల్లి వాస్తవ్యులు, సీపీఐ సీనియర్ నాయకులు, దక్షిణ మధ్య రైల్వే ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు గుమ్మడి వెంకటరత్నం కుమారులు గుమ్మడి రవి, గుమ్మడి తాతకృష్ణ రూ.లక్ష విరాళాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణకు ఆహ్వాన సంఘం కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానసంఘు ప్యాట్రన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, ఆర్గనైజింగ్ కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకులు చెరుకూరి సుబ్బారావు, గుంటుపల్లి శాఖా కార్యదర్శి రంగారావు తదితరులు పాల్గొన్నారు. విరాళమిచ్చిన గుమ్మడి రవి, తాతకృష్ణకు రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

జనార్ధనరావు రూ.10 వేలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సీపీఐ 24వ జాతీయ మహాసభల జయప్రదం కోరుతూ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయు) రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి.జనార్ధనరావు 95వ జన్మదినం సందర్భంగా రూ.10వేలు విరాళాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధనరావు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు మోదీ ద్రోహం

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

విశాలాంధ్ర-హైదరాబాద్: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని తప్పుడు వాగ్దానాలు చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యువతకు ద్రోహం చేస్తున్నాడని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ విమర్శించారు. దేశ సంపదను అమ్ముకోవడానికే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, నేడు ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటినీ కార్పొరేట్లకు విక్రయిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసే స్వభావం ప్రధాని మోదీకి రైల్వే స్టేషన్లలో టీ అమ్ముకునే రోజుల నుంచి ఉందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం స్టార్టప్‌లు, డిజిటల్ ఇండియా అంటూ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మీ వాగ్దానాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని మఖ్దూం భవన్‌లో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాహ్ ఖాద్రి, ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీకాంత్‌తో కలిసి తిరుమలై రామన్ మాట్లాడారు. మోదీ పాలనలో నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోయిందని, ఈ విషయాన్ని భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సీఎంఐఈ వివరాలు పేర్కొన్నాయని గుర్తు చేశారు. నిరుద్యోగానికి వ్యతిరేకంగా యువత గొంతు పెంచడమే ఏఐవైఎఫ్ లక్ష్యం అని, వచ్చే నెలలో ఢిల్లీలో జరగబోయే ఏఐవైఎఫ్ జాతీయ సమితి సమావేశాలలో మోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు. కొత్త సైనిక నియామక పథకంతో కూడా యువతను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దగా చేసిందని అన్నారు. కేంద్రం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ దేశ యువత తమ స్వరం పెంచాలని తిరుమలై రామన్ ఉద్బోధించారు.

కుల జాడ్యాన్ని తరిమికొట్టాల్సిందే : మీరా కుమార్

న్యూఢిల్లీ: కుల వ్యవస్థ జాఢ్యాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరముందని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఉద్ఘాటించారు. పక్షపాతానికి తావులేని ద్వేషరహిత విధానాన్ని అవలంబించాలని పిలుపు నిచ్చారు. కులం పేరుతో జరుగుతున్న ఇటువంటి దాడులను ఏదో ఒక ప్రభుత్వానికో, పార్టీకో ఆపాదించవద్దనీ, అలా చేయడం వల్ల కుల వ్యవస్థ నిర్మూలన అంశం పక్కదారి పడుతోందని అభిప్రాయపడ్డారు. రాజస్థాన్‌లో తాగునీటి కుండను తాకినందుకు టీచర్ తీవ్రంగా కొట్టడంతో ఓ దళిత బాలుడు మరణించిన ఘటనపై ఆ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దళితులపై జరుగుతున్న వరుస దాడుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలో ఏమైనా లోపం కనిపిస్తున్నదా అన్న ప్రశ్నకు మీరాకుమార్ పై విధంగా సమాధానమిచ్చారు. 'ఈ విషయంపై ప్రతిఒక్కరూ నన్ను అడుగుతున్నారు... నేను ఎవ్వరిపైనా ఆరోపణ చేయడంలేదు... ఎవ్వరికీ మద్దతు ఇవ్వడం లేదు... దీనికి రాజకీయాలు కూడా కొంతవరకు బాధ్యతే అయినప్పటికీ ఇదొక సామాజిక సమస్య... రాజకీయాలు అంటేనే సమాజ ప్రతిబింబం' అని మీరా కుమార్ పేర్కొన్నారు.

ఓ పార్టీ అధికారంలో ఉన్న ప్రాంతంలోనే, ఆయా రాష్ట్రాల్లోనే ఇవి ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పడం సరికాదన్న ఆమె... ఇటువంటి విషయాల్లో రాజకీయ కోణాలను మాట్లాడడం వల్ల సమస్య పక్కదారి పడుతుందన్నారు. వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన ఈ దురాచారాన్ని నిర్మూలించేందుకు సమాజం, ముఖ్యంగా యువత ముందుకు రావాలన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.